# ఈశ్వరుని అమ్మ ఈశ్వరమ్మ



**భగవాన్**

**శ్రీ సత్యసాయిబాబావారి**

**దివ్యోపన్యాసములనుండి**

# విషయసూచిక

1. మాతృదేవోభవ

2. దేహభావము నుండి దైవభావమునకు

3. తల్లి సత్యసంకల్పము, సాయి నిత్యసంకల్పము

4. గజేంద్రుని పిలుపు, ప్రభువు రాక

5. మాతృప్రేమ

# మాతృదేవో భవ

కౌసల్యసతి శుక్తి గర్భమౌటను గదా
రాముడు దేవుడై రమణ గాంచె
సీతామహాసాధ్వి చెలగి పెంచుట గదా
కవలు కుశలవులు ఘనులు అగుట
జిజియాలలామయు చెలగి పెంచుట గదా
వీర శివాజియు పేరు గాంచె
పుత్తలీబాయి రంజిల్లి పెంచుట గదా
గాంధి మహాత్ముడై ఘనత గాంచె
ఈశ్వరాంబాసాధ్వి ఎత్తి పెంచుట గదా
సత్యనారాయణుడు విశ్వశాంతి కెదిగె
అహరహమ్మును బ్రోచెడి అమ్మకంటె
ఆదరంబగు వ్యక్తులు అవని కలరె
అమ్మ ప్రధమాక్షరండె ఆద్యక్షరంబు
ప్రాణికోటికి అమ్మయె ప్రాణసమము.

ప్రపంచములో అనేకవిధములైన సంబంధబాంధవ్యము లుండినప్పటికిని తల్లికి మించిన బాంధవ్యము ఈ జగత్తులో కానరాదు. ఇట్టి తల్లియొక్క సంబంధబాంధవ్యము గుర్తించియే దేశమునకు కూడా 'మాతృదేశమ'ని, మాట్లాడు భాషకు 'మాతృభాష' అని పేరు వచ్చింది. తల్లులు పవిత్రమైన హృదయులు కనుకనే తల్లుల యొక్క జాడల ననుసరించియే కుమారులు ఈ జగత్తునందు అనేకవిధములైన పేరుప్రతిష్ఠలను అందుకోగల్గుతున్నారు. తల్లుల పెంపకముచేతనే కుమారులు గుణవంతులుగను, కీర్తివంతులుగను, మేధావంతులుగను అభివృద్ధి గాంచుతూవచ్చారు. కనుక ప్రప్రథమములో తల్లి పేరు తరువాత తండ్రి పేరు ఉంచుతారు. ఇది కేవలము భౌతికమైన, లౌకికమైన జగత్తునకు మాత్రమే కాదు. నివృత్తి మార్గమందు, ఆధ్యాత్మికమార్గమందు కూడ స్త్రీలకు ప్రథమ స్థానమునందిస్తూ వచ్చారు.

సీతారాములు – సీతను మొదట, రాముని తరువాత ఉంచుతారు. అదేవిధముగా లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ. దీనిలోని అంతరార్థము ఏమిటి? తల్లి ప్రకృతిస్వరూపిణి. ఇది ప్రకృతికి ప్రధానమైన సూత్రము. దేహము ముందు, ఆత్మ వెనుక. ఆత్మ లేకుండా దేహము సంచరించదు. దేహమే లేకుండిన ఆత్మకు

విలువయే లేదు. కనుక దేహాత్మభావము అవినాభావసంబంధము.

నీ కంటికి కనిపించి, మనసుకు అనిపించి, హృదయాన్ని మురిపించి తన్మయత్వము గావించేది తల్లిదండ్రులేగానీ దైవము కాదు. కనుక మొట్టమొదట తల్లిదండ్రులను దైవముగా విశ్వసించాలి. తల్లిదండ్రులకు నీవు గౌరవమునందించినప్పుడే పరోక్షమైన దైవత్వము నీకు సాక్షాత్కారమవుతుంది. మొట్టమొదట దయ, సహనము, శాంతి, సత్యము, సానుభూతి యిత్యాది సద్గుణములు నేర్పించేది తల్లియే. తల్లియే మొట్టమొదట తండ్రిని చూపుతుంది. తండ్రి, "నాయనా! ఇతను నీ గురువు. గురువు చెప్పినట్లు విను" అని గురువును చూపుతాడు. గురువు దైవాన్ని చూపుతాడు. కనుక తల్లి, తండ్రి, గురువు, దైవము. తల్లిని మొట్టమొదట పెట్టారు. జగత్తునందున్న సమస్త విషయములు గుర్తింపచేసేది, బోధించేది తల్లి మాత్రమే.

ఈశ్వరమ్మ ఈ శరీరమునకు తల్లి. ఈమెకు పూర్వము 'నామగిరమ్మ' అని పేరు. ప్రాచీన భారతీయ స్త్రీలు ప్రతి పౌర్ణిమనాడు సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించేవారు. అదేవిధముగా, ఈ శరీరమునకు తల్లియైన ఈశ్వరమ్మ కూడా పక్కింటి సుబ్బమ్మతో చేరి ప్రతి పౌర్ణిమనాడు సత్యనారాయణ పూజ చేస్తూ, సత్యనారాయణ వ్రత కథను వింటూవచ్చింది. ఒకనాడు సుబ్బమ్మ వ్రతము పూర్తయ్యేసరికి చాలా ఆలస్యమైంది. అంతవరకు ఈశ్వరమ్మ భోజనం చేయలేదు. 'ఈ సత్యనారాయణ పూజ నిమిత్తమై ఇన్ని నిబంధనలా?' అని యింట్లో అందరూ విసుగు చెందారు. ఆమె భర్త పెద్దవెంకమరాజు కూడా ఆమె పట్టుదలను ఖండించాడు. 'మీకు ఆకలైతే భుజించండి. నాకు ఆకలిగా లేదు. సత్యనారాయణవ్రత ప్రసాదం తీసుకున్న తరువాతనే భోజనం చేస్తాన'ని ఈశ్వరమ్మ పట్టుపట్టింది. సుబ్బమ్మ వ్రతము పూర్తిచేసి ప్రసాదము తెచ్చి ఈశ్వరమ్మకు అందించింది. ఆ ప్రసాదమును భుజించిన తరువాతనే ఈశ్వరమ్మకు గర్భము నిల్చింది. 'యద్భావం తద్భవతి'. మానవునియొక్క స్థితిగతులు అతని సంకల్పములపైనే ఆధారపడి ఉంటాయి. ఈశ్వరమ్మ ఒక్క అక్షరముకూడా చదువుకోలేదు. ఐతే, ఆమెకు భగవంతునిపై అచంచలమైన భక్తి, విశ్వాసములుండేవి. ఏడవ నెలలో ఒకనాడు సుబ్బమ్మ యింటికి వచ్చి, 'ఈశ్వరమ్మా! నీవు సత్యనారాయణ వ్రత ప్రసాదమును భుజించిన తరువాతనే నీకు గర్భము నిల్చింది. కాబట్టి, నీకు పుట్టబోయే కుమారునికి సత్యనారాయణుడని పేరు పెట్టు' అని చెప్పింది. పెద్దవెంకమరాజు తల్లికూడా ప్రగాఢమైన విశ్వాసంతో అందుకు అంగీకరించింది.

ప్రసవమునకు పూర్వం ఒక విశిష్టమైన సంఘటన జరిగింది. ఆరోజుల్లో ఈ పుట్టపర్తి చాలా చిన్న పల్లె. నాలుగిండ్ల మధ్యలో ఒక చేదబావి ఉండేది. ఒకనాడు ఈశ్వరమ్మ ఆ భావి నుండి నీరు చేదుకొని వెళుతున్నది. అప్పుడు ఆకాశంలో ఏదో మెరుపు మెరిసినట్లైంది. గాలి వీచింది. ఆ దివ్య తేజోపుంజము ఈశ్వరమ్మ గర్భంలో ప్రవేశించింది. అప్పుడే యింటినుండి బయటికి వచ్చిన సుబ్బమ్మ కూడా ఆ దృశ్యాన్ని చూచింది. 'ఆకాశమునుండి ఏమిటో ఒక వెలుగు నీ గర్భములో ప్రవేశించినట్లుగా నాకు కనిపించిదమ్మా!' అని ఈశ్వరమ్మతో చెప్పింది. ఈ విషయాన్ని ఈనాటి వరకు నేను ఎవరికీ చెప్పలేదు. అవతారతత్త్వము యింత పరిశుద్ధముగా, యింత గొప్పగా వుంటుందని అందరూ తెలుసుకొనే నిమిత్తమై నేను వెల్లడి చేస్తున్నాను.

ప్రసవమునకు ముందురోజు సాయంకాలము పెద్ద వెంకమరాజు కరణం సుబ్బమ్మ యింటిముందునుండి వెడుతున్నాడు. సుబ్బమ్మ ఆయనను లోపలికి పిలిచి, 'వెంకమరాజూ! మీకు పుట్టబోయే రుమారునికి సత్యనారాయణ అని పేరు పెట్టు' అని చెప్పింది. ఆయన, 'ఇదంతా స్త్రీల మూర్ఖపు పట్టుదల' అని అనుకున్నాడు. సరే! మరునాడు తెల్లవారుఝామున సుమూహర్తమునందు ఈశ్వరమ్మకు కుమారుడు

పుట్టాడు. పుట్టిన తక్షణమే ఏడ్వటము పిల్లలకు సహజము. కాని, ఈ పిల్లవాడు మాత్రం ఏడ్వలేదు. అది గమనించి చుట్టూ వున్న ఆడవారు, 'ఈ పిల్లవాడు ప్రాణము లేనట్లు పుట్టాడే' అని కంగారు పడ్డారు. వాళ్ళ మాటలు విన్న ఈశ్వరమ్మకు కూడా భయం కలిగింది. ఎవ్వరూ చూడకుండా బిడ్డను గట్టిగా గిల్లింది, ప్రాణముంటే ఏడుస్తాడు కదాయని. ఆ పిల్లవాడు ఏడ్వటానికి బదులు నవ్వాడు. పురిటి బిడ్డ! అప్పటికింకా గంట కాలేదు. ఆ బిడ్డ నవ్వటమనేది ఎంత ఆశ్చర్యము! ఇంతలో కరణం సుబ్బమ్మ వచ్చి, 'ఈశ్వరమ్మా! సుమూహర్తంలో నీకు కుమారుడు పుట్టినట్లు విన్నాను. చూడాలని వచ్చాను' అన్నది. సుబ్బమ్మ బ్రాహ్మణ స్త్రీ. ఆనాటి బ్రాహ్మణ స్త్రీలు ఎక్కువగా మడి, ఆచారములను పాటించేవారు. అందువలన, ఈశ్వరమ్మ తన బిడ్డను ఒక బట్టపై ఉంచి సుబ్బమ్మకు కాస్త దూరంగా పెట్టింది. ఇంతలో అత్తగారు వచ్చి, 'ఏమి ఈశ్వరమ్మా! సుబ్బమ్మ ఎంతో ప్రేమతో చూడాలని వస్తే నీ బిడ్డను ఆమెకు దూరంగా పెడుతున్నావే! ఆమె చేతికి అందించు' అన్నది. దానికి ఈశ్వరమ్మ, 'అత్తా! పురిటి బిడ్డను ఆమె ముట్టదేమోనని అలా దూరంగా పెట్టాను' అని చెప్పింది. నిజానికి సుబ్బమ్మకు అలాంటి భేదాలు ఉండేవి కావు.

ఈ పిల్లవాడు శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్థమానుడవుతూ వచ్చాడు. అయితే, అతని పద్ధతి కొంచెం వింతగా ఉండేది. ఎవ్వరితోనూ మాట్లాడేవాడు కాదు. మితభాషి. మితాహారి. తల్లి ఈశ్వరమ్మ చాలా ఆశ్చర్యపడుతూ వచ్చింది. సాధారణంగా పిల్లలు తిండికి వెంపర్లాడుతూ ఉంటారు. ఏదైనా తినుబండారము కనిపిస్తే చేయి జాపుతుంటారు. కాని, ఈ పిల్లవానికి తిండిపై యేమాత్రమూ ధ్యాస లేదు. మాంసాహారమును దగ్గరకు కూడా రానిచ్చేవాడు కాదు. మాంసాహారము భుజించే వాళ్ళింటికి తాను వెళ్ళేవాడు కాదు. భగవత్ప్రసాదము వలన కలిగినవాడు కనుక ఇటువంటి పదార్థములను యిష్టపడడని గుర్తించింది ఈశ్వరమ్మ. తల్లికి తాళం వేస్తూ వచ్చింది, పెద్ద బిడ్డ వెంకమ్మ. వీరిరువురూ కలసి ఈ పిల్లవానిని అల్లారుముద్దుగా పెంచుతూ, నిరంతరము దైవసంబంధమైన పాటలు పాడుతూ ఉండేవారు. ఇలాంటి పవిత్ర వాతావరణంలో ఈ బిడ్డ పెరుగుతూ వచ్చాడు.

ఈ రీరమునకు తాత కొండమరాజు. మహాజ్ఞాని. ఆయన నిరంతరము వెంకావధూతను ఆరాధన చేసేవాడు. అతనికి దివ్యదృష్టి కూడా ఉండేది. కొండమరాజు తమ్ముడు సుబ్బరాజు. తమ్ముడు మొదటే మరణించాడు. అతనికి సుబ్బరాజు,వెంకమరాజు అని యిద్దరు కుమారులు. కొండమరాజు కుమారులు పెదవెంకమరాజు, చినవెంకమరాజు. పెదవెంకమరాజు ఈ శరీరమునకు తండ్రి. ఈ నలుగురు కుమారులు, తాను కలసిమెలసి ఉండేవారు. ఒకనాడు యీ నలుగురికి భేదాభిప్రాయములు కలిగి విడిపోవాలని సంకల్పించుకున్నారు. కుమారులు అన్నదమ్ములేగానీ కోడండ్రు అక్కచెల్లెళ్ళు అవుతారా! ఆడవారివలన కొన్ని భేదములు ఏర్పడుతూ వచ్చాయి. అప్పుడు ఈ శరీరమునకు ఎనిమిది సంవత్సరములు. కొండమరాజు, "ఉన్నదంతా మీ నలుగురూ పంచుకోండి. నాకేమీ అక్కర లేదు" అన్నాడు. "అయితే మీరు ఎట్లా? ఒక్కొక్కరి దగ్గర ఆరు నెలలు గడపండి" అన్నారు. అప్పుడు కొండమరాజు, "మీ యింటికి నేను రాను. మీ అన్నము నాకు అక్కరలేదు. నేను సంపాయించినది మీ నలుగురూ సమంగా పంచుకోండి నాకు ఒక్క ప్రాపర్టీ యివ్వండి". "ఏమిటది?" అని అడిగారు. "ఈ సత్యాన్ని నాకివ్వండి. ఈ అబ్బాయి ఒక్కడు నాదగ్గర ఉంటే నాకు ఎవరూ అక్కరలేదు" అన్నాడు. నన్ను అడిగాడు, "సత్యం! నావెంట వస్తావా?" అని. "తప్పక వస్తాన"ని వెళ్లాను. అతను ఒక చిన్న గది అద్దెకు తీసుకున్నాడు. నా పని ఏమిటి? తెల్లవారి లేవటం, పాత్రలు తోమటం, అన్నం, కూరలు నేనే చేయటం. తిరిగి బుక్కపట్నం స్కూలుకి పోవటం. అక్కడ ఒంటి గంటకు బెల్ కొడతారు భోజనానికి. అక్కడనుంచి పరుగెత్తి రావటం. ఆయనకు వడ్డించి నేను భుజించటం. తిరిగి పరుగెత్తి పోవటం. ఈవిధంగా టైము తప్పకుండా చేస్తూవచ్చాను. దివ్యదృష్టి కలిగినవాడు కనుక నన్ను మాత్రమే ఆశిస్తూ వచ్చాడు. ఒకనాడు

పెదవెంకమరాజుని పిలిచి, “నాకు ఒకవిధమైన ఊహలు వస్తున్నాయి. దివ్యమైన భావాలు నాలో ఆవిర్భవిస్తున్నాయి. నీ భార్యకు నామగిరమ్మ పేరు మార్చు” అన్నాడు. “ఏమి పేరు పెట్టాలి?” అడిగాడు. “ఈశ్వరమ్మ అని పెట్టు” అన్నాడు. ‘ఈశ్వరమ్మ’ అనగా అతని ఉద్దేశ్యము ఏమిటి? ఈశ్వరునికి అమ్మ ఈశ్వరమ్మ. నాన్నగారు చెప్పారుకదా అని ఆమెకు ఆ పేరు పెట్టారు.

# దేహభావము నుండి దైవభావమునకు

ఈశ్వరమ్మ చదువుకోలేదు. ఈనాటి విద్యావంతుల నడతను, ఫ్యాషన్లను చూస్తే చదువు తెలియక పోవటమే మంచిదనుకుంటాను. ఈ దేహానికి ఏడున్నర సంవత్సరాల ప్రాయంలో అందరికి పండరి భజన నేర్పించేవాడిని. ఆ అడుగులు వేస్తూ, ఆ పాటలు పాడుతుంటే ఈశ్వరమ్మ, సుబ్బమ్మ ఎంతో ఆనందించేవారు. ఒకనాడు వెంకమరాజు ఇంటి ఖర్చులకోసం యిచ్చిన డబ్బులో ఈశ్వరమ్మ దగ్గర రెండణాలు మిగిలాయి. వాటికి రెండు మూటలు బొరుగులు వచ్చాయి. ఈ బొరుగులను ఆమె పిల్లలందరికి పంచిపెట్టింది. ఆమె త్యాగభావం కలిగినది. ఎవరు వచ్చినా ప్రేమతో పలుకరించేది. స్వామి చూడలేదని ఎవరైనా బాధపడితే “స్వామి ఏది చేసినా మీ మంచి కోసమే. మీరేమీ బాధపడవద్దు” అని బోధ చేసేది.

చదువుకోసమని నన్ను ఉరవకొండకు తీసుకు వెళ్లినప్పుడు నేను పదిమందిపిల్లలకు రాత్రిపూట చదువు చెప్పేవాడిని. నేను అక్కడనుండి వచ్చేటప్పుడు ఆ పిల్లలందరూ చాలా బాధ పడ్డారు. ఒక్కొక్కరు ఒక్కొక్క బొట్టు గురుదక్షిణగా తెచ్చి యిచ్చారు. బొట్టు అంటే మూడు పైసలు. నాలుగు బొట్లు కలిపితే ఒక అణా అవుతుంది. ఆ పిల్లలు తెచ్చింది మొత్తం కలిపి రెండున్నర అణాలైంది. ఆ డబ్బును నేను ఈశ్వరమ్మ చేతికి యిచ్చాను. ఆమె నా చేయి పట్టుకొని “నాయనా! ఈ చిన్న వయస్సులో నీకింత త్యాగమా!” అని కన్నీరు కార్చింది. ఆనాటినుండి తాను పోయేవరకు ఆ డబ్బు మూట కట్టుకొని తన దగ్గరే పెట్టుకుంది. ఉరవకొండలో ఉండగా అక్టోబరు 20వ తేదీ

హంపీనుండి వచ్చి స్కూలుకరుగుచు బాబా
కాలరుపిన్నొకటి జారి కనపడలేదు
మార్పు కలిగెను నాడు ప్రాపంచిక సంబంధముపిన్నైతొలగె

ఈ ప్రాపంచిక సంబంధమంతా ఒక పిన్నుతో సమానం నాకు. అది తొలగి పోయింది. భక్తుల గాథలు నివారించే నిమిత్తమైనేను వెళ్లాలన్నాను. అప్పటినుండి పుస్తకాలు అక్కడ పారవేసాను. అక్కడ ఎక్సైజు కమీషనరు హనుమంతరావు అని ఉండేవాడు. వారి తోటకు వెళ్లాను. ఆయన చాలా భక్తుడు. అయ్యో రాజు వచ్చాడని యేమేమో తిండిపదార్థములు చేయించాడు. ఏమీ ముట్టలేదు. శేషమరాజు వచ్చాడు. సత్యా యింటికి పోదాముర‌మ్మని చాలా బాధ పెట్టాడు. నేనురానన్నాను. ఎప్పుడూ నాకు జవాబు చెప్పే స్వభావము లేదు. ఆ జవాబు చెప్తుతుంటే అతనికే చాలా ఆశ్చర్యం వేసింది. ఈ సత్యానికి యింత ధైర్యం ఎక్కడనుండి వచ్చింది? నవ్వుతూ, నవ్వుతూ ఉండే నా ముఖము యొక్క తేజస్సు అతనిని

కప్పిపెడుతున్నాది. ఈశ్వరమ్మ, పెద్దవెంకమరాజు యిద్దరిని తక్షణమే బయలుదేరి రమ్మని ఒక స్కూలు పిల్లవానితో చెప్పిపంపించాడు. వీరిద్దరూ అక్కడికి వచ్చారు. శషమరాజు యిద్దరిని తీసుకొని ఆంజనేయులు యింటికి వచ్చాడు. 'నాయనా! యింటికి పోదాము రా, యింటికి పోదామురా' అని ఈశ్వరమ్మ చాలా ఏడ్చింది. నేను చెప్పాను 'ఎక్కడికీ నేను రాను, రావాలని కోరుకుంటే మీ వెంట పుట్టపర్తి వస్తాను. అక్కడికి వచ్చి ఆ గ్రామస్తులను ఆనందపర్చి నా యిష్టప్రకారము నేను వెడతాను' అన్నాను.

ఆ కాలరుపిన్ను జరిపోవటం, స్కూలుకి పోకుండా నిల్చిపోవటం, తల్లిదండ్రులిద్దరూ రావటం, నన్ను యిక్కడికి తీసుకురావటం యీవిధమైన కారణాలు పురస్కరించుకొనియే స్వామి ఉరవకొండ వదలి పెట్టాడు. అప్పటినుండి బెంగుళూరు, మైసూరునుండి కార్లంతా రావటం ప్రారంభమైంది. కాఫీపొడి సాకమ్మ, మైసూరు రాణీగారు, దేశిరాజు అర్సు (మైసూరు మహారాజా మేనమామ)వారందరూ 'స్వామీ! మేమందరము యిక్కడికి రావాలంటే కష్టముగా ఉంటున్నాది. మీరే మైసూరు రండి. మేము ప్యాలస్ యిస్తాము' అన్నారు. ఆ రాత్రి ఈశ్వరమ్మ వచ్చి ఏడ్చింది. 'స్వామీ! ఎందరో వచ్చి కోరుతున్నారు. వారివారి స్వార్ధము కోసమని స్వామిని యిక్కడకు రండి, యిక్కడకు రండి అని తీసుకు పోతున్నారు. మీరు పుట్టపర్తి వదలితే నేను బ్రతకను. మీరు పుట్టపర్తిలోనే ఉండాలి. నాకు మాట యివ్వండి' అంది. నేను మాట యిచ్చాను. 'ఏనాటికైనా నేను పుట్టపర్తి వదలను' అని చెప్పాను. అందువలననే పుట్టపర్తిలోనే పెద్దమందిరము కట్టి వచ్చేభక్తులందరికీ అనుకూలాలు ఏర్పరిచి తగిన ఆనందమునందిస్తున్నాను'

కమలాపురంలో స్కౌటు సేవ అయిన తరువాత తిరిగి యింటికి పోయేటప్పుడు పండ్లు, స్వీట్లు యిలాంటివి తీసుకొని కమలాపురం యింటికి పోయాను. అప్పుడు ఆయన (అన్నగారు) వచ్చాడు. రూళ్ళకఱ్ఱతో రూల్సు వేసుకుంటున్నాడు. ఈ మూడు దినములు నీరు తీసుకొని వచ్చి చాలా అలసిపోయిందని కోపం పెట్టుకున్నాడు. పండ్లు, స్వీట్లు యివిగో అమ్మా అని యిచ్చాను (వదినగారికి). ఈ పండ్లు, స్వీట్లు ఎవరికి కావాలని ఆమె పారేసింది. ఆమెకు కోపం వస్తే ఈయనకు మరింత కోపం వచ్చింది. రూళ్ళతో కొట్టాడు చేతిపై. ఆ రూలర్ మూడు ముక్కలైంది. చేయి వాచిపోయింది. ఏం చేసేది? ఎవరికీ చెప్పలేదు. ప్రక్కయింటిలో ఒక ముసలమ్మ ఉంటున్నాది. ఆమె పేరు సుబ్బమ్మ. ఆమె ఏడ్చేది. రెండవ దినమే యీయన కుమారుడు, చిన్నపిల్లవాడు, మరణించాడు. మరణించేటప్పటికి పుట్టపర్తి టెలిగ్రాము యిచ్చాడు. పుట్టపర్తిలో అప్పుడు పోష్టాఫీసు, టెలిగ్రాఫ్ ఆఫీసు లేదు. బుక్కపట్నం వస్తే అక్కడనుండి మనిషిని పంపించేవారు. పెదవెంకమరాజు సంతకోసం బుక్కపట్నం వెళ్లడు. అక్కడ యీ టెలిగ్రాం చూసుకున్నాడు. తక్షణమే బస్సు ఎక్కి కమలాపురం వచ్చాడు. "ఏమిటిరా యిది" అన్నాడు చేయి చూచి. "కురుపు లేచింది" అన్నాను. ఏమీ చెప్పలేదు. సాయంకాలమయ్యేటప్పటికి పక్కింటి ఆమె అన్నీ యీయనకు చెప్పింది. ప్రతి దినము కొడుతుంటారు. తిడుతుంటారు. నీరు తేవటం. అన్నీ చెప్పింది. చీకటి పడింది. "నేను బయటకు పోవాల"న్నాడు. అక్కడ నీళ్లు లేవు. లైటు లేదు. చిన్న లాంతరు పట్టుకొని, ఒక చెంబుతో నీరు పట్టుకొని నేను ముందు పోయాను. ఊరంతా దాటిన తరువాత " సత్యా! నిలు, నిలు" అన్నాడు. " లాంతరు అక్కడ పెట్టు" అన్నాడు. రెండు చేతులు పట్టుకున్నాడు. ఒకటే ఏడ్చాడు. " నాయనా! ఊపిరి ఉంటే ఉప్పు అమ్ముకునైనా తింటాను. నేను సాకలేకనా నిన్ను యిక్కడకు పంపించాను. ఎందుకింత అవస్థలు పడుతున్నావు? కన్న తండ్రిగా నేను ఒక్క వేటు ఎప్పుడూ కొట్టలేదు. నిన్ను విపరీతముగా బాధలు పెడుతున్నారు. బయలుదేరు" అన్నాడు. నేను చెప్పాను, "ఇది చాలా తప్పు. ఈ సమయంలో సహాయం లేకుండా పోతే చాలా మోసం అవుతుంది. ఏమీ అనుకోవద్దు. మీరు పొండి. నేను వస్తాను" అన్నాను. వారిపైన ఏ ద్వేషములు నేను చెప్పలేదు. ఆయన వెళ్లిన తరువాత చాలా జాబులు ఒకదాని తరువాత ఒకటి వెంనే బయలుదేరమని వ్రాసాడు. నమ్ముతానో నమ్మనో అని మీ అమ్మ చాలా

అనారోగ్యంతో ఉంది అని వ్రాసేవాడు. నాకు తెలుసు ఆమెకు ఏమీ సీరియస్ లేదని. పరీక్షలయ్యేంతవరకు అక్కడే ఉన్నాను. ఈవిధంగా జరిగిపోయింది.

లోకములో భగవత్తత్వాన్ని గుర్తించలేనివారు అనేకరకములైన భ్రాంతులతో మునిగిపోతుంటారు. నేను పాతమందిరములో ఉన్నరోజుల్లో ఒకనాడు చాలామంది గుంపులు గుంపులుగా అక్కడికి వచ్చారు. ఈశ్వరమ్మ మెల్లగా నా దగ్గరికి వచ్చి "స్వామీ! చాలా చెడ్డ మనుష్యులవలె కనిపిస్తున్నారు. మీకేమైనా అపకారము చేస్తారేమో అన్న భయంతో నాకు నిద్ర పట్టటం లేదు" అన్నది. అప్పుడు నేను "నీవిలాంటి భయానికి చోటివ్వకు. ఏనాటికైనా దేహాన్ని వదలక తప్పదు. కాబట్టి దేహాభిమానాన్ని వదలిపెట్టు" అన్నాను. ఆమెకు ధైర్యం చెప్పి యింటికి పంపించాను. అదొక పాత గడ్డి కొట్టం. అందులో నేను ఒక్కడినే పడుకున్నాను. ఆనాటి రాత్రి ఆ యింటికి నాల్గువైపులనుండి నిప్పు అంటించారు. మంటలు రగుల్కొని ఉవ్వెత్తున ఎగిసాయి. సుబ్బమ్మ, ఈశ్వరమ్మ పరుగెత్తి వచ్చారు. వాళ్ళు వచ్చేసరికి ఎక్కడలేని వర్షం ఆ ఇంటిపైన కుండపోతగా కురిసి మంటలను ఆర్పివేసింది. నేను బయటకు వచ్చాను. నన్ను చూసి ఈశ్వరమ్మ, సుబ్బమ్మలు "స్వామీ! మీరు క్షేమంగా ఉన్నారు. మాకంతే చాలు" అంటూ ఆనందభాష్పాలు రాల్చారు.

కొండమరాజుకి స్వామి అంటే భక్తి. నా సత్యము బాగా గుర్తించుకున్నవాడు. ఒక దినము యింట్లో ఎవరూ లేరు. పోయి తలుపులు వేసాడు. నేను వంట చేస్తున్నాను. అతనికి వంట చేసి పెట్టటం నా పని. నాకు వంట బాగా తెలుసు. వంట చేస్తుంటే వచ్చాడు. "సత్యా! సత్యా!" అన్నాడు. "ఏమి?" అని అడిగాను. నా రెండు చేతులు గట్టిగా పట్టుకొని "ఇవి చేతులు కాదు. నీ పాదములని తలంచుకో. నేను ఒక కోరిక కోరుతున్నాను. నాకు తెలుసు. మీరు సామాన్యమైన బిడ్డ కాదు. సాక్షాత్ ఈశ్వరుడే. మా జన్మము తరింపచేసేకోసమని మా వంశములో ఉద్భవించారు. దశరథుడు ప్రాణం వదిలే సమయంలో రాముని చేతులతో నీరు త్రాగాలని ఆశించాడు. కానీ దశరథునికి ఆ ప్రాప్తి చిక్కలేదు. జటాయువుకి అట్టి ప్రాప్తి చిక్కింది. ఆ ప్రాప్తిని నాకందించండి. మీ అమృత హస్తముతో నా నోటిలో నీరు పోసినప్పుడు నేను ప్రాణం వదలాలి. ఆ కోరిక నెరవేర్చండి" అన్నాడు. తప్పక అదేవిధంగా జరుగుతుందని మాట యిచ్చాను. తరువాత అతను పది సంవత్సరములు బ్రతికాడు.

కొత్త మందిరము కట్టిన తరువాత ఉదయము, సాయంత్రము వచ్చిపోయేవాడు. ఎంతైనా మానవత్వమునకు ఒక అభిమానం ఉంటుంది. ఈ అభిమాన మమకారములచేత తమ హృదయాన్ని పూర్తి వివరించుకోలేకపోతారు మానవులు. తెల్లవారుఝామునే వచ్చేవాడు. కొత్తమందిరమునకు ముందు పడుకొనేవాడిని. ఇసుక ఉంటే యిసుక పైనే పడుకొనేవాడిని. ఆయన వస్తున్నాడని తెలుసుకొని నిండుగా కప్పుకొనేవాడిని పూర్తి ముఖం వరకు. ఎందుకంటే ఆయనకు నేను మేలుకున్నట్లు తెలియకూడదు. నిద్రపోతున్నాడు కదా అని పాదాలకు నమస్కారం చేసి పోయేవాడు. ఇతరులు చూస్తే, 112 సంవత్సరముల వయస్సువాడు మనుమనికి నమస్కారము చేస్తుంటే ఎవరన్నా ఏమైనా అనుకుంటారని అభిమానము అతనికి. ఆయన పోతూనే నేను లేచి కూర్చొనేవాడిని. ఈవిధంగా నేను లీలలు చేస్తూవచ్చాను.

అప్పుడు కారు నేనే డ్రైవ్ చేసుకొని పోయేవాడిని. నేను వస్తున్న విషయం గుర్తించాడు. ఈశ్వరమ్మను పిలిపించాడు తన యింటినుండి. "ఈశ్వరమ్మా! దగ్గరకు రా" అన్నాడు. "నేను యిక ఉండను. ఈ సత్యాన్ని గుర్తించే భగవంతుడు వస్తున్నాడు". "ఏమిటి మామా? ఎక్కడున్నాడు? ఎట్లా వస్తాడు?" లౌకికమైన మాటలు మాట్లాడుతున్నది. "పిచ్చిదానా! ఇంకా కుమార భ్రాంతిలోనే ఉన్నావా? అదుగో

వస్తున్నాడు చూడు దేవుడు" అన్నాడు. ఆమెకు కూడా కొన్ని తెలుసు. స్వామియొక్క అతీత శక్తులు కొన్ని గుర్తించేది. కానీ భ్రాంతి చేత పుత్రవాత్సల్యముతో మునిగిపోయేది. "ఈశ్వరమ్మా! ఒక టంబ్లరుతో నీరు తీసుకొనిరా. దేవుడొస్తున్నాడు నన్ను తీసుకొని పోవటానికి. నాకు మాట యిచ్చాడు. టంబ్లరుతో నీరు తీసుకొనిరా. అతను త్రాపుతాడు. నేను వెళ్ళిపోతాను" అన్నాడు. "జ్వరము లేదు. జబ్బు లేదు. నీవు ఎట్లా పోతావు?" అనింది. చెప్పాడు కొండమరాజు, "మరణమునకు కారణము లేదు. దైవాజ్ఞతో జరిగేవి. పుట్టుటకు ఏవిధమైన కారణాలు వచ్చాయి? పుట్టుటకు కారణం లేనప్పుడు చావుకు కారణాలుండవు. ఇది సత్యం, సత్యం, సత్యం. నీవు కొంచెం నీరు తీసుకొనిరా." ముసలాయనతో ఎందుకు పోట్లాడాలని కొంచెం నీరు తీసుకొని వచ్చింది. ముందున్న తులసీ దళము గ్లాసులో వేయమన్నాడు. తాను క్రింద కూర్చున్నాడు. నన్ను మంచంపై కూర్చోమన్నాడు. నా మోకాళ్ళపై తన తల పెట్టుకున్నాడు. "స్వామీ! నా మొర ఒకటి ఆలకించండి" అన్నాడు. ఈశ్వరమ్మ కూడా వింటున్నది. ఏమిటి యింత పెద్దాయన మనుమనిపై యింత ప్రేమగా ఉంటున్నాడే, యింత గౌరవము చూపుతున్నాడే అని ఆమె లోపల భావిస్తూ వచ్చింది. "స్వామీ! నేను చిన్న వ్యాపారము చేసుకొనేవాడను. కాబట్టి ఎవరికైనా కాసో, బొట్టో అప్పుగా ఉండవచ్చు. నేను ఋణములో లేకుండా రక్షించు" అన్నాడు. "తప్పక నేను రక్షిస్తాను" అన్నాను. "ఆకాశము ముక్కలై పడినా మీ వాగ్దానము వృథా కాదు. పది సంవత్సరముల క్రితము యిచ్చిన వాగ్దానమును నిలబెట్టుకోవడంకోసం యిప్పుడు వస్తున్నారు". నేను నవ్వినాను. "నవ్వులతో మోసం చేయకండి. ఇదిగో ఈ టంబ్లరు తీసుకొని ఒక్కతూరి త్రాగి ఆ శేషము నా నోట్లో పోయండి" అన్నాడు. ఆయన ఒక చరిత్ర చెప్పాడు. దశరథుడు పుత్రకామేష్టి చేసి నల్గురు కుమారులను కన్నాడు. సాక్షాత్ నారాయణమూర్తే అతని కుమారుడు. ఆదిశేషుడే లక్ష్మణుడుగా పుట్టాడు. శంఖు చక్రములే, భరత శత్రుఘ్నులుగా పుట్టారు. అట్లా పుట్టినప్పటికి కట్టకడపటికి ఒక్కరైనా నీరు పోసేవారు లేకపోయారు. స్వామీ! మా రత్నాకర వంశములో మీరు జన్మించారు. ఆపస్తంభ సూత్రము. భరద్వాజ గోత్రము. అన్నీ దైవానికి సంబంధించినవే. ఆ దైవము నా గృహములో పుట్టాడు. ఇదిగో ఈ ఒక్క ప్రాప్తి అందించండి. నిరాశ పరచకండి". "దానికోసమే వచ్చాను" అని చెప్పాను. నీరు తీసుకొని పోద్దామంటే "వద్దు, వద్దు మీరు త్రాగి పోయాల"న్నాడు. సరే కొంచెం త్రాగి అతని నోట్లో పోశాను. నీరు త్రాపుతూ ఉండగానే ......పోయింది. ఆయన మనోభీష్టం నెరవేరింది.

పోయేముందు చెబుతున్నాడు, "ఈశ్వరమ్మా! మీరందరు కేవలం భౌతిక దేహాలను ఆధారం చేసుకొని బంధుత్వ భ్రాంతిలో ఉన్నారు. శరీర సంబంధబాంధవ్యములన్నీ కదలిపోయే మేఘములవంటివి. కాని, ఆత్మ సంబంధము  శాశ్వతమైనది. దేహాభిమానం తగ్గించుకో. ఆత్మాభిమానం పెంచుకో. ఈశ్వరమ్మా! స్వామి ప్రభావం యావత్ ప్రపంచమంతా ప్రాకుతుంది. ఈ ప్రపంచాన్నే మార్చివేస్తుంది. దేశదేశములవారు కూడా యిక్కడ నివసించుతారు. జాగ్రత్తగా ఉండండి. మాయతో 'నా కుమారుడు, మా పిల్లవాడు' అనే భావమునకు అవకాశము యివ్వకండి. అతడు అందరివాడు. 'బృందావనమది అందరిది గోవిందుడు అందరివాడేలే.' స్వామి అందరివాడు. మన కుటుంబమునకే సంబంధించినవాడు కాదు" అని తలపై చేయి పెట్టాడు. ఆనాటినుండి ఆమె యింటిలో లేదు. ప్రశాంతినిలయం వచ్చి చేరిపోయింది. ప్రశాంతినిలయంలో దినం ఉదయం సాయంత్రం వచ్చి స్వామితో మాట్లాడి వెళ్లిపోయేది.

ఈశ్వరమ్మ ఈశ్వరతత్త్వం చక్కగా గుర్తించింది. ఒక్కతూరి ఈశ్వరుడు వచ్చినట్లుగా వస్తే, "స్వామీ! ఈ పాములన్నీ ఏమిటి?" అనేది. "నేనేమీ వేసుకోలేదే" అని చెప్పేది ఏమీ తెలియనట్లుగా. తానే దూరము పోయేది. చూడు పాములంతా ఉంటున్నాయి. తరువాత చూసేటప్పటికి ఏమీ లేవు. చెంపలు కొట్టుకొని క్షమాభిక్ష వేడుకొనేది. ఈవిధంగా అనేక పర్యాయములు స్వామి విషయములు గుర్తించుకొనేది. దివ్యత్వాన్ని గుర్తింపచేసుకొని తనకు తెలియనట్లుగా నటించే తల్లులుంటారు. కౌసల్య కూడ అట్లనే. యశోద కూడ

అట్లనే. వీరందరు పుత్రవాత్సల్యముచేత మాయకప్పినట్లు వారు జీవించుతూ వచ్చారు.

శివరాత్రి వచ్చింది. నేను ఉపన్యాసం యిచ్చిన తరువాత లింగోద్భవం జరిగింది. లింగోద్భవమునకు ముందు నేను బాధపడటం చూసి ఈశ్వరమ్మ అంతమంది జనంలోనుండి లేచి వేదికపైకి వచ్చేసింది. "ఏమిటి యింత అవస్థ పడుతున్నారు? ఎందుకోసం యీ అవస్థ? లోపలకు రండి" అంది. "నేను యిప్పుడు రాను" అన్నాను. చాలా ఏడ్చింది. ఆమె ఎంత ఏడ్చినా నేను లోపలికి పోలేదు. ఆమె లోపలకు వెళ్లిపోయింది. అప్పుడు లింగాలు ఉద్భవించాయి. హిరణ్యగర్భ లింగము కూడా వచ్చింది. అందరూ చప్పట్లు కొట్టారు. ఆ చప్పట్లు విని ఆమె బయటకు వచ్చింది. అప్పుడు నేను ఆ లింగమును అందరికి చూపుతున్నాను. భక్తులందరూ లేచారు. అందుచేత ఆమెకు కనిపించలేదు. మరునాడు నా దగ్గరకు వచ్చి 'స్వామీ! మీరు లింగము తీసినారుట. నేను చూడలేదు. నాకు చూడాలని ఉంది" అన్నది. "అప్పుడు తీసి ఎవరికో యిచ్చేసాను. ముమ్ముందు చూస్తావులే" అన్నాను. "సరే మిమ్మల్ని తొందర పెట్టనని వెళ్లిపోయింది. ఈవిధంగా ఆమె ఏ విషయంలోనైనా స్వామిని ి కించిత్తుకుడా బాధపెట్టేది కాదు. "స్వామీ! మిమ్మల్ని కష్టపెట్టటం నాకు యిష్టంలేదు. మీరు కష్టపడితే జగత్తే కష్టపడుతుంది. మీరు ఆనందిస్తే జగత్తంతా ఆనందిస్తుంది" అనేది.

ఇంట్లో గృహం అబ్బాయి (తండ్రి) ఉండేవాడు. ఆయన నన్ను ఎప్పుడూ తిట్టేవాడు కాదు. ఎప్పుడూ తిట్టలేదు. ఎప్పుడూ కొట్ట లేదు. "మహా త్యాగివిరా నీవు. నీ వైరాగ్యం మాకు ఎక్కడ వస్తుంది?" అని తమాషా చేసేవాడు. నన్ను "వేదాంతి" అని పిల్చేవాడు. గృహం అమ్మాయి (తల్లి) కూడా అంతే. ఆమెకూడా నన్ను ప్రేమతో చూసుకునేది. అనేకమంది భక్తులు ఆమెకు తమ బాధలు చెప్పుకొనేవారు. "అమ్మా! స్వామితో మీరైనా చెప్పండి" అని ఆమె పాదాలపై పడేవారు. ఆమె అవన్నీ నాతో చెప్పటానికి వస్తే "వారి సుద్దులు, వీరి సుద్దులు నీవెందుకు పట్టించుకుంటావు? ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకో" అనేవాడిని. "స్వామీ! నేనింత మాత్రమైనా వారికి సహాయము చేయకపోతే నేను పుట్టి ప్రయోజనం ఏమిటి? వారి బాధలు మీకు చెబుతే చాలు అవి కొంత పరిహారమవుతాయి. కాబట్టి మీరు నన్ను ఎంత కోప్పడినా నేను మాత్రం చెప్పటం మానను," అనేది. పవిత్రమైన భావాలతో వారు జీవితాన్ని గడిపారు. కుటుంబమును బట్టి వశమంతా అభివృద్ధి అవుతుంది.

గృహం అబ్బాయి చిన్న వ్యాపారము చేసేవాడు. ఏమి వ్యాపారమంటే, స్వామి దగ్గరకు వచ్చేవారు "కొబ్బరికాయ కావాలి వెంకప్పా" అంటే పరుగెత్తి బుక్కపట్నం పోయి కొబ్బరికాయ తీసుకొని వచ్చేవాడు. ఈవిధంగా ఆయన వచ్చే భక్తులందరికీ సహాయము చేసేవాడు. ఒకరోజు ఇంటర్వ్యూ రూమ్‌లోకి పిల్చాను. స్తంభం దగ్గర నిల్చున్నాడు. "స్వామీ! మీతో ఒక విషయం మాట్లాడాలి" అన్నాడు. "ఉండు, ఉండు వీళ్లను చూసి వస్తాను" అన్నాను. "లేదు, లేదు తొందరగా మాట్లాడాలి" అన్నాడు. 'ఏమి పని' అని అడిగాను. 'స్వామీ! నేను ఎవరికీ పరాధీనములో పోకూడదు. ఎవరి ఋణము నాకు ఉండకూడదు. ఋణవిముక్తి జరగాలి. నేను వ్యాపారము చేసినప్పుడు బొట్టో, అర్థణాయో కొంచెం మోసం జరిగి ఉండవచ్చు. కనుక ఆ పాప పరిహారనిమిత్తమై యిదినేనుకష్టపడి సంపాయించుకున్నాను. నేనుచనిపోయినతరువాత పదవదినమునాడు బీదలకు అన్నదానము చేయాలి. రెండు మూటలు బియ్యం పెట్టాను. బెల్లం పెట్టాను. ఎవరూ వీటిని తీసుకోకూడదు. ఖర్చులకు యిది తీసుకొని నా పదవ దినమున సమారాధన చేయండి" అని ఐదు వందలరూపాయలు నా చేతిలో పెట్టాడు. ఇక్కడనుండి యింటికి వెళ్లి కూర్చున్నాడు. "ఎవరక్కడ?" అన్నాడు. ఆరోజుల్లో భార్యను పేరు పెట్టిపిలిచేది లేదు. ఈశ్వరమ్మ వచ్చేసింది. ఇంతలో ప్రాణం వదిలాడు. వీరి మరణాలు ఎంత సులభంగా వచ్చినాయంటే అంత సులభంగా వచ్చినాయి. అంత ఆనందంగా నా దగ్గరికి వచ్చి నడచుకొని పోయి, పండుకొని ఆవిధంగా ప్రాణం విడిచాడు.

సానుభూతులంపిన సాధక బృందమునకు సత్యసాయి సందేశము. ప్రేమస్వరూపులారా! ఈ ఉపాధి పితృస్వరూపులైన పెద్దవెంకమరాజు ఉపాధివిసర్జన విషయము అతి విచారముతో అనేకవేలమంది నాకు సానుభూతులంపిరి. వారి ఆత్మకు శాంతి చేకూర్చమని కోరిరి. ఇది లోకసహజమేమో, కానీ నాకది అసహజముగా అనిపించెను.

ఆయుః పరిమితి నిండగనే కాయము వీడుట అందరికీ సహజమే. దానినే వీరును అనుసరించిరి. ఇంతమాత్రమునకు విచారమెందులకు? సహజమునకు విచారము వరుద్ధ ధర్మము. పుట్టిన ఏవస్తువైననూ మార్పుచెందక ఉండదు. పుట్టుట గిట్టుట కనునది, గిట్టుట పుట్టుట కనునదీ, సామాన్య వాక్యము. కానీ పుట్టుట తిరిగి పుట్టకుండుటకే, గిట్టుట తిరిగి గిట్టకుండుటకే. అను సత్యమును సర్వులూ ముఖ్యముగా తెలుసుకొనవలసిన విషయము. దేహమునకు వస్త్రమెట్టి సంబంధమో, దేహికి దేహమట్టి సంబంధము. ఆ అనుబంధమే నేడింత విచారమునకు సంబంధమైతే నాకట్టి సంబంధము ఏమాత్రమూ లేదు. దేహసంబంధములు అనిత్య, అసత్యములైనవి. ఆత్మ సంబంధమే నిత్యసత్యనిర్మలమైనది. అదే నాకునూ, మీకునూ, లోకమునకూ ఏకసంబంధము. అది వదలునదీ, కదలునదీ, మెదలునదీ కాదు. ఎన్నివేల ఉపాధులో మన కండ్ల యెదుట వదలుతున్నారు. చూచు చున్నారు. వింటున్నారు. కానీ యింకనూ యదార్ధము తెలుసుకొనలేక యీవిధమైన సహజమునకు ఆశ్చర్యపడుచూ, విచారమును అనుభవించుచున్నారే అనునదే నాకు పెద్దవిచారము. అంతకుతప్ప నాకేవిధమైన విచారము లేదు. రాదు.

ఇక వారి ఆత్మకు శాంతి చేకూర్చమని వ్రాసిరి. ఇది మరింత ఆశ్చర్యకరమైన విషయము. ఆత్మకు శాంతి స్వభావమై ఉండగా, ఇంకా ప్రత్యేకించి శాంతిని చేకూర్చుటెట్లు? స్వభావ స్వరూపములు అవినాభావములు కదా! స్వరూపము ఆత్మ, స్వభావము శాంతము. ఇవి రెండునూ ఏకమై ఉండునవే. లోకములో ఏ చింతయూ లేక, ఏ బాధలు పడక, ఒకరితో చేయించుకొనక కడపటి శ్వాసవరకు తన కర్మలు తాను చేసుకుంటూ మరణమను చింతసహితము లేక, ఆనందముతో అంత్య శ్వాస విడుచుట అదృష్టమనియూ, పుణ్యాత్ముడనియూ తలంతురు. అతను యీ చిహ్నములే కాక. ఏనాడు ఈ ఉపాధికి తండ్రి అనిపించుకొనెనో, ఏనాడు ఈ ఉపాధి అతని పుత్రుడనిపించుకొనెనో, ఆనాడే అతని జన్మ ధన్యమైనది, పుణ్యమైనది. అట్టి ప్రాప్తి యుగమునకొక్కరికే ప్రాప్తించును. అందరికీ సాధ్యము కాదు.

ఎట్టివారికైననూ, ఎన్నిదినములుండిననూ, సత్కీర్తి స్థిరముగా నిల్చునట్టిది, మిగిలినవి గాలిలో లీనమే. దేహమున్నంతవరకు, సత్కర్మలు చేయించుచూ, సద్గుణములు అలవర్చుచూ, సదాచారములాచరించుచూ, సర్వేశ్వర చింతలో శ్వాసము లీనము చేయుటే సార్ధకత. కనుక వదలిన ఉపాధులకు చింతించుట మానుడు. ఉపాధులను వదలు సమయము ఉమాపతిని తలంచుట నేర్చుడు.

# తల్లి సత్యసంకల్పము
# సాయి నిత్యసంకల్పము

స్వామి వైభవం క్రమక్రమేణా విస్తరిస్తున్న రోజుల్లో ఒకనాడు ఈశ్వరమ్మ నేను భోజనం చేస్తున్నప్పుడు పైకి వచ్చింది. ఎవరెవరో వస్తుంటే 'మీరెవరు రాకండి" అని చెప్పింది. పైకి వచ్చి నా రెండు చేతులు పట్టుకొని "స్వామీ! మన గ్రామంలో చిన్న ఆసుపత్రి అయినా లేదు. చిన్నపిల్లలకేమైనా అనారోగ్యం కలుగుతే తల్లులు వాళ్ళను ఎత్తుకొని చికిత్సకోసం బుక్కపట్నం వెళ్ళవలసి వస్తున్నది. వారి అవస్థను నేను చూడలేకపోతున్నాను. నాకు చాలా బాధగా ఉంది. నా బిడ్డలు ఎంతో వారి బిడ్డలు కూడా అంతే కదా. కాబట్టి యిక్కడ ఒక చిన్న ఆసుపత్రి కట్టించండి" అని కోరింది. తప్పక కట్టిస్తానని మాట యిచ్చాను. తరువాత నేను పెద్దదే కట్టించాను. బెజవాడ గోపాలరెడ్డి అనే మంత్రిని పిలిపించి ప్రారంభోత్సవము చేయించాను. ఆనాడు ఈశ్వరమ్మ ఆనందంతో పొంగిపోయింది. ఇంత గొప్పగా జరుగుతుందని ఈశ్వరమ్మ అనుకోలేదు. మరునాడు నా దగ్గరకు వచ్చింది. "స్వామీ! ప్రజల బాధలు తగ్గించి నా మనోభీష్టమును నెరవేర్చారు" అన్నది. "ఇకపై ఆనందంగా ఉండు" అన్నాను. "ఇప్పుడే కాదు. ఇంకా ఉంది" అన్నది.

కొంత కాలమైన తరువాత ఈశరమ్మ వచ్చి "స్వామీ! మన పుట్టపర్తి గ్రామం చాలా చిన్నది. మన గ్రామంలో చిన్న పాఠశాల అయినా లేకపోవటంచేత పిల్లలు చాలా యిబ్బందికి గురౌతున్నారు. ఈ గ్రామంలోని పిల్లలు చదువు నిమిత్తమై బుక్కపట్నం నడచి వెడుతున్న దృశ్యం చూస్తే నా హృదయం ద్రవిస్తోంది. మీరు దయాసాగరులు. మన గ్రామంలో చిన్న స్కూలు కట్టించండి" అంది. "ఎక్కడ కట్టించమంటావు?" అని అడిగాను. "స్వామీ! నా యింటి స్థలం వెనుక కొంత స్థలం ఉంది. అక్కడ కట్టించండి" అంది. ఆమె కోరిక మేరకు పుట్టపర్తిలో ఒక చిన్న పాఠశాల కట్టించాను. క్రమక్రమేణా దానిని పెద్ద బిల్డింగు చేసాను. ఈశ్వరమ్మ వెళ్ళి చూసింది. అక్కడున్న చిన్నచిన్న పిల్లలను ముద్దుపెట్టుకొని వారిపై తన ప్రేమను కురిపించింది. ఆమెకు చాలా సంతోషమైంది. "స్వామీ! ఈ కలియుగంలో తల్లితండ్రులను పీడించే కొడుకులే పుడుతున్నారుగానీ ప్రేమించే కొడుకులు పుట్టటంలేదు. ఇలాంటి పరిస్థితిలో తల్లియొక్క మనోభీష్టములను నెరవేర్చే నీవంటి కుమారుడు పుట్టటం నా అదృష్టం" అంది.

"సత్యం వద, ధర్మం చర, మాతృదేవో భవ, పితృదేవో భవ" అనే ఉపనిషద్వాక్యములను నిలబెట్టి, భారతీయ సంస్కృతీ సాంప్రదాయములను అందరూ ఆచరించవలెనన్నదే నా ఉద్దేశ్యము. బోధించితే చాలదు. ఆచరించి అందించే నిమిత్తమై యీామె పేరుతో ఈ ఉన్నత పాఠశాలను స్థాపించటము, ఆయన

పేరుతో కళ్యాణమండపమును స్థాపించటము. అమ్మనాన్నగారి ఆస్తిపాస్తులు మాత్రం కావాలి. వారి ఆజ్ఞను మాత్రం పాలించటం చేతకాదనేవారు భారతపుత్రులే కాదు. వారి రక్తమునే ధారపోసి, పోషించి పెద్దచేసిన తల్లిదండ్రులను చేతనైనంతవరకు తమ శక్తిని అర్పితము చేయటము ప్రతి ఒక్కరి కర్తవ్యము.

చిన్న విత్తనమే పెద్దవృక్షముగా మారిపోయినట్లు ఆనాడు కట్టించిన చిన్న స్కూలే ఈనాడు పెద్ద యూనివర్సిటీగా మారిపోయింది. ఆనాడు కట్టించిన చిన్న ఆసుపత్రియే ఇప్పుడు పెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మారిపోయింది. తల్లియొక్క సత్య సంకల్పము, సాయియొక్క నిత్యసంకల్పము రెండింటియొక్క కూడికచేతనే యిది సాధ్యమైంది.

తరువాత మరొక రోజు వచ్చింది. "స్వామీ! ఇంకొక్క చిన్న కోరిక ఉంది. మన చిత్రావతి వర్షాలు వచ్చినప్పుడు పొంగిపోతుందిగానీ లేనప్పుడు కనీసం త్రాగటానికైనా నీరుండదు. మన గ్రామ ప్రజలు నీటి ఎద్దడితో సతమత మవుతున్నారు. నీటి సౌకర్యం కల్పించండి" అంది. "అవుతుంది, అవుతుంది యోచన పెట్టుకోకు" అన్నాను. ఈ రోజుల్లో నీరు కావాలంటే బోర్లు వేస్తున్నారు. కానీ బోర్లు వేస్తే ప్రయోజనం ఉండదు. కొంతకాలం నీరు వస్తుంది. తరువాత అందులో నీరు ఒక్కచుక్కైనా ఉండదు. కాబట్టి నాకు బోర్లు వేయటం ఇష్టం ఉండదు. పాతమందిరంలోనే ఒక బావి తవ్వించాను. మంచి మనస్సుతో ఏది సంకల్పించినా అది ఫలిస్తుంది. ఏడడుగులుకూడా తవ్వలేదు, పెద్ద నీటిబుగ్గ పడింది. గ్రామ ప్రజలందరు వచ్చి నీరు తీసుకు వెళ్లటానికి వీలుగా మందిరం వెనుక తలుపు పెట్టించాను. మీకు తెలుసు. క్రమక్రమేణా అనంతపురంజిల్లా అంతటికి తుంగభద్ర నుండి నీరు తెప్పించి యిచ్చాను. దీనికి సుమారు మూడు వందల కోట్ల రూపాయలు ఖర్చైంది. ఈశ్వరమ్మ అభీష్టాన్ని నెరవేర్చాను. "చిన్న బావి కాదమ్మా! ఈ రాయలసీమకే నేను నీరందిస్తాను" అని ఆ దినమే చెప్పాను. "అదేమిటో నాకు తెలియదు. ఈ ఊరికి నీరిచ్చావు. అదే నాకు సంతోషము" అన్నది. సంకల్పములు ఉత్తమమైనవిగా ఉన్నప్పుడు అవి తప్పక నెరవేరుతాయి.

# గజేంద్రుని పిలుపు, ప్రభువు రాక

ఒక్కొక్కప్పుడు ఏదైనా అడిగి తిరిగి వెళ్లేటప్పుడు రెండు మెట్లు దిగి మరల వెనక్కి వచ్చి "స్వామీ! మీకేమైనా కష్టం కలిగిస్తున్నానా?" అని అడిగేది. నాకేమీ కష్టంగా లేదంటే సంతోషంగా వెళ్లిపోయేది. వచ్చిన ప్రతి ఒక్కరికి "స్వామిని కష్టపెట్టకుండా మీరు సంతోషపడండి" అని చెప్పేది. ఎవరైనా మినిష్టర్లు వస్తున్నారంటే, ఎఱ్ఱటోపీ పెట్టుకొని పోలీసు వస్తున్నాడంటే చాలా భయపడేది. "స్వామీ! మినిష్టరు వస్తున్నాడుట, ఎక్కడ ఉంటాడో ఏమో, ఏమి అడుగుతాడో ఏమో" అనేది. "నీవేమీ భయపడవద్దు. అన్నీ నేను చూసుకుంటాను" అనేవాడిని. తల్లి ప్రేమ ఆవిధంగా ఉంటుంది. ఆమెకు ఏవిధమైన కొరతలు లేకుండా ఆమె ఉన్నంతవరకు సంపూర్ణ శాంతిని అందించాను. తల్లి ప్రేమను పదిమంది దృష్టికి తెప్పించే నిమిత్తమై ప్రతి సంవత్సరం "ఈశ్వరమ్మ డే" జరుపుతున్నాము. ప్రతి ఒక్కరు తల్లిని సంతోషపెట్టాలి. తల్లిని సంతోషపెడితే స్వామిని సంతోషపెట్టినట్లే.

ఈశ్వరమ్మ భౌతికకాయము వీడుటకు ఒకరోజు ముందు నేను అడిగాను "నీకు ఇంకా కోరిక ఏమైనా ఉందా?" ఆమె చెప్పింది "తీర్థయాత్రలను చేశాను. పెద్ద దేవాలయాలను, అక్కడున్న దేవుళ్ళను కూడా చూసాను. ఇంకా ఏమి చూడాలని కోరిక ఉంటుంది?" అన్నది. ఆమె కోరిక ఏదో ఒకమూల మనస్సులో దాగి ఉన్నది. ఆమె తన మనుమరాలి పుట్టినరోజు పండుగకు బహుమతి యివ్వాలనుకొంది. అందువల్ల ఐదువందలరూపాయలిచ్చి బజారుకు వెళ్లి అవసరమైనవి కొని తెచ్చుకొమ్మన్నాను. అంతేకాదు. ఆ పని చేయమని పట్టుపట్టాను. బజారుకి వెళ్ళి అనుకున్నవి కొనుక్కుంది.

బెంగుళూరులో సమ్మర్ క్లాసులు జరుగుతున్నాయి. పిల్లలకు టిఫిన్ పెట్టారు. తెల్లవారి ఏడున్నర గంటలకే పెట్టేశారు. అప్పుడు గోకాక్. చాలా గట్టివాడు. కరెక్టుగా నడిపించేవాడు. ఈమె టిఫిన్ తిని వరండాలో కూర్చుంది. ఉన్నట్లుండి "స్వామీ! స్వామీ!" అని అరిచింది. నేను మేడపైన ఉన్నాను. "వస్తున్నా" అన్నాను. "బిఱ్ఱున రండి" అంది. ప్రాణం విడిచింది. అది గజేంద్రుని పిలుపు వలె, ప్రభువు రాకవలె జరిగిపోయింది. రెండు వైర్లు కలిపితే వెలుగు వస్తుంది కదా! ఇది ప్రామాణికమైన సమాప్తి. దీనికొరకే అందరూ ప్రయత్నించాలి. అనగా పవిత్రమైన జీవితములకు పవిత్రమైన మరణాలే వస్తుంటాయి. కొండమరాజు అంతే, పెదవెంకమరాజు అంతే. ఈశ్వరమ్మ అంతే. అంతా సునాయాసంగా పోయినారు. వీరంతా సెలెక్టెడ్ పీపుల్.

# మాతృప్రేమ

సన్నజాజి కన్న సంపంగిలత కన్న
జున్నుగడ్డ కన్న వెన్న కన్న
నెమలి కన్ను కన్న నిండు వెన్నెల కన్న
కన్నతల్లి ప్రేమ సున్నితంబు

స్వామికి తల్లి, తండ్రి అనే దేహభావం లేదు, అయినప్పటికి జన్మయొక్క ఆదర్శము నిరూపించే నిమిత్తమై, మాతృప్రేమను నిరూపించే నిమిత్తమై వారి సమాధికి పుట్టిన దినమున వెడుతూ ఉండేవాడిని. ఎందుకోసం వెడుతూ వచ్చాను? నేను ఏమి చేసినా యితరులకు ఆదర్శము నిరూపించుతూ వచ్చాను. ఈ భావము పురస్కరించుకొనియే తల్లియొక్క ఉత్తమ మనస్సు కరిగిపోతూ ఉంటుంది. ఇప్పటికి ఈ శరీరమునకు తల్లి మరణించి ముప్ఫై సంవత్సరములైంది. తల్లి ప్రేమకు మించిన ప్రేమ లేదు. మీకు తెలుసో లేదోగానీ యిప్పటికీ తల్లియొక్క ప్రేమ ప్రత్యక్షంగా కనిపిస్తూనే ఉంది. ఇప్పటికీ ఈశ్వరమ్మ సజీవంగానే, సదేహంగానే సంచరిస్తున్నాది. నా రూములో ముగ్గురు పిల్లలు పడుకుంటారు. వారు కూడా ఆ దృశ్యాన్ని చూశారు. ఇది ఎందుకు చెబుతున్నానంటే ఆదర్శవంతమైన తల్లుల జీవితము అమృతమయమైన జీవితమే.

ఒకనాడు భజన చూసుకొని పదిగంటలకు పూర్ణచంద్ర ఆడిటోరియంకు వచ్చాను. నేను పైరూమ్‌కి పోయాను. పైన కూర్చొని ఉంది ఈ శరీరమునకు తల్లియైన ఈశ్వరమ్మ. “ఎందుకు ఈవిధంగా వస్తున్నావ”ని అడిగాను. “ఇది మంచిది కాదు. ఇతరులు ఏమి భావిస్తారు? వద్దు, వద్దు” అన్నాను. “స్వామీ! ఇది మాతృహృదయము. మీకేమి తెలుసు? మాతృభావముతో ఉండినప్పుడు తెలుస్తుంది. మాతృభావముతో ఉన్నాను. మీరు దైవభావముతో ఉన్నారు. దైవభావానికి మాతృభావము అర్థము కాదు. మాతృభావానికి దైవభావము అర్థము కాదు. మిమ్మల్ని చూచి ఒక చిన్న విషయం చెప్పిపోవాలని వచ్చాను”. “ఏమిటో చెప్పు. నేను బిఖ్ఖున పోవాలి” అన్నాను. “స్వామీ! ఎప్పుడూ తొందరపడితే ఎట్లా? కొంచెం శాంతంగా ఉండండి. స్వామీ! ఈనాడు లోకము సరియైన స్థితిలో లేదు. ప్రపంచమంతయూ ఏదో దురవస్థలతోనూ, దుర్గుణములతోనూ, దుశ్చింతలతోనూ ఉంటున్నారు. అందరూ ప్రేమతో వస్తున్నారని మీరు భావిస్తున్నారు. మీ భావము మీకు సహజమే. కానీ నా భావమునకు అది సహజం కాదు. ప్రతి ఒక్కరు, జనంలోకి వెళ్ళినప్పుడు చేతి రుమాలు యిస్తుంటారు మీకు. అందించినప్పుడు చాలా భయం వేస్తుంది నాకు. కనుకనే నేటి నుండి ఎవరు మీకు పూర్ణవిశ్వాసంగా ఉంటారో, ఎవరు మీకు సన్నిహితులుగా ఉంటారో వారి నుండి మాత్రమే కర్చీఫ్ తీసుకోండి. ఇంకెవరిచ్చినా తీసుకోకండి”. నేను అడిగాను. “ఎందుకోసం యీవిధంగా చెబుతున్నావు?” “స్వామీ! మీకు లోకమంతా సమానమే. అందరూ మీకు బిడ్డలే. అందరూ మీకు సమానులే అయినప్పటికీ కొంతమంది హృదయాలు పాషాణంగా ఉంటాయి. ఆ కర్చీఫ్ లోపల కొంచెం పాషాణం పెట్టి యివ్వవచ్చు. అది మీరు మూతి తుడుచుకున్నప్పుడు నాలుకకు

చేరుతుంది. అప్పుడు చాలా ప్రమాదమవుతుంది. కనుక అలాంటివి మీరు ముట్టకండి. కాలం సరి లేదు". "సరే నీ తృప్తికోసం ముట్టనులే" అని చెప్పాను. తల్లి మరణించిన తరువాత కూడా ప్రేమ సజీవంగానే ఉంటుంది.

మరి రెండు పర్యాయములు రాత్రి వచ్చింది. నా రూములో పడుకొనేవారు కూడా చూచారు. వారు ఎప్పుడు ఈమెను చూసిన వారు కాదు. ఎవరు ముసలమ్మ వచ్చిందని ఆశ్చర్యపడుతున్నారు. "లిఫ్ట్ బీగం మా దగ్గరే ఉంది. మెట్లు లేవు. ఎట్లా వచ్చింది ఈమె" అని అనుకుంటున్న సమయంలో నేను లేచాను. మీరు ఏమీ అడగకండని "మరి ఎందుకోసం వచ్చినావు?" అని అడిగాను. "అప్పుడప్పుడు నేను మిమ్మల్ని చూడందే ఉండలేను. మిమ్మల్ని ఒక్కతూరి చూచినప్పుడు ఆనందమవుతుంది. మిమ్మల్ని చూచి పోవటానికి వచ్చాను" అంది. అప్పుడు రెండు మాటలు చెప్పింది. "స్వామీ! అందరు భక్తులము, భక్తులము అని చెప్పుకుంటారు. కానీ ఎవరు భక్తులో మాకు తెలియదు. పరిపూర్ణ భక్తుడు దేనికైనా సిద్ధంగా ఉంటాడు మీ ఆజ్ఞకు. కానీ కొందరు స్వార్థంకోసమని భక్తిని ప్రకటిస్తూ ఉంటారు. మీనుంచి వారి కోర్కెలు నెరవేర్చుకుంటారు. తరువాత మిమ్మల్ని మర్చిపోతారు. ఈవిషయంలో మీరు జాగ్రత్తగా ఉండండి" అంది. నేను చెప్పాను"నా జాగ్రత్త నాకు తెలుసు. నీవు చెప్పనక్కరలేదు" అన్నాను. నవ్వుకుంటూ తిరిగి వెళ్లిపోయింది.

మరి కొన్ని దినముల తరువాత నేను పండుకొన్నాను. రాత్రి ఒంటి గంట అయింది. లోపల బాత్‌రూందగ్గరకు వెళ్లాను. మాట్లాడుతున్నది గట్టిగా. నేను చెప్పాను, "మెత్తగా మాట్లాడు. పిల్లలు నిద్రపోతున్నారు. వారు లేస్తారు. నీ విషయం వారికి తెలుస్తుంది" అన్నాను. "ఒకరి భయం నాకెందుకు? మీరంటే భయంగానీ ఇంకెవరన్నా భయంలేదు. తప్పు చేసిన వారికి భయం ఉంటుంది. నేను ఎవ్వరికి భయపడను. నేను ఏ తప్పూ చేయలేదు. ఏ తప్పూ చేయని వారికి భయమెందుకు? పుత్రవాత్సల్యముచేత నేను వస్తున్నానుగానీ మరొక భావము కాదు". "వచ్చినావు. ఏమి కారణమ"న్నాను. "స్వామీ! నిన్నటి దినము పండుగ. మీరు కొత్త పంచె కట్టుకున్నారు. చాలా పెద్దదిగా కనపడుతుందని అందరిని బెల్టు అడుక్కుంటూ వచ్చారు." నా గదిలో ఉండే పిల్లలను అడిగాను. "నాయనా! నాది పట్టుపంచె కాబట్టి గట్టిగా కట్టుకోటానికి వీలుకాకుండా ఉంది. నాకొక బెల్టు కావాలి" అని. కానీ వారిచ్చిన బెల్టుకున్న 'బకిల్' చాలా మెరుస్తున్నది. అది నా చొక్కా లోపలినుండి బయటకి కనిపిస్తుంది. దానిని చూసిన వారు సాయిబాబా బంగారు బెల్టు వేసుకున్నాడని అనుకుంటారు. కాబట్టినాకు అలాంటి బెల్టు అక్కర్లేదన్నాను. ఆమె వచ్చి మాట్లాడుతుంటే పిల్లలు లేచి కూర్చున్నారు. "స్వామీ! ఎవరూ మీ గదిలోకి ప్రవేశించటానికి వీలు కాదే! క్రింద లిఫ్టుకి బీగం వేశామే! ఎవరు వచ్చారు? మీరు ఎవరితో మాట్లాడుతున్నారు?" అని అడిగారు. అప్పుడు చెప్పాను, "గృహం అమ్మాయి ఈశ్వరమ్మ వచ్చింది. ఇదిగో దీనిని నాకిచ్చి వెళ్లింది" అని బెల్టును చూపించాను. దానికి 'బకిల్' లేదు. అతికిస్తే అతుక్కుంటుంది. మాతృప్రేమ ఈవిధంగా ఉంటుందని తెల్పుటకు యీ ప్రత్యక్ష ప్రమాణాలు మీకందిస్తున్నాను. ఆమె దేహము మాత్రం వదిలిందిగానీ ప్రాణం ఎప్పుడూ స్వామితోనే ఉంటుంది. "నీ కోసం ఎన్నో వ్రతాలు చేసాను. ఎన్నో పుజలు చేసాను. నా పూజాఫలము పండింది. నీతో నేను నలభై సంవత్సరములు ఉండినాను. అదే ధన్యము" నా తల్లిని నేనే సెలక్టు చేసుకున్నాను. ఆమెకు నాకు గల సన్నిహిత సంబంధబాంధవ్యము అలాంటిది.

# ధన్యహో! ఈశ్వరాంబ!

ఉ॥ శ్రీకర సత్యసాయిని, విశిష్ఠగుణాఢ్యుని, దేవదేవు "ర
త్నాకర" వంశమందు పరమాత్ముడవై తనరార,ధాత్రిలో
నీ కమనీయ గర్భమున నిన్ను తలంపగ కంటివమ్మ! బల్
ప్రాకటమైన భక్తి తన భక్తులు కొల్వగనుండె పర్తిలో.

ఉ॥ నీదగు గర్భమందు అవనీతలమందున పుట్టగోరుచున్
శ్రీదయితుండు సాయి, నిను చేరెను గర్భములోన తానె,ఆ
మోదము కల్గచేసె నవమోహన కృష్ణుడు సత్యసాయి,స
మ్మోదముగూర్చె దేవుడయి, మోదముపొంద ప్రంచమంతయున్.

ఉ॥ ధన్యవు ఈశ్వరమ్మ! కడుధన్యవు నీ సుకృతంబదేమొ? సౌ
జన్యవు మాతలందున, వశాల జగత్తున నిన్ను బోలు వా
రన్యులు కానరారు, పరమాత్మునికన్న వరాలతల్లి! సా
మాన్యులకర్థమౌనె? అల మాధవుడే జనియించె ధాత్రిలో.

ఉ॥ నీదు "సమాధి" వద్ద మరి నిల్వని, మ్రొక్కనివాడు లేడు ఆ
మోదముతోడ కొల్తురిక, మోహనమూర్తికి కన్నతల్లివై
ఆదరమందినావు, మరి అంతట దేవుని తల్లివౌటచే
పాదులుగట్టె ప్రేమరసపాకము మా హృదయంబులోపలన్.

గీ॥ దేశదేశాలు పర్తిలో తేజరిల్లు
నీవు కన్నట్టి 'శ్రీసాయి' నీరజాక్షు
చేరికొల్వంగ నెవ్వేళ చెల్మిగాంత్రు
అన్ని వర్ణాలు వత్తురానంమొంది
అంతకన్నను భాగ్యంబు నెచట కలదు?

గీ॥ ఆత్మవిజ్ఞాన తేజంబులందుకొన్న
శుద్ధసాత్విక సౌజన్య సుగుణఖనివి
తల్లి! నీవంటి 'బంగారుతల్లి'నెపుడు
తలచి, కొలచిన చిత్తంబు ధన్యమగును !

కవికుమార్